సాక్షి విశాఖపట్నం

సోమవారం । 11 । మార్చి । 2024



ఆర్టీసీ సమ్మర్ ఆఫర్!

ఆర్టీసీ ఈ వేసవిలో ఊరటనిచ్చే ఆఫర్ ఇస్తోంది. దూర ప్రాంతాలకు వెళ్లే వారికి టికెట్లపై రాయితీ ప్రకటించింది. 8లో



జోరుగా హుషారుగా.. 8లో



న్యూస్‌రీల్

వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు

- పక్షులు, మూగజీవాల దాహార్తి తీర్చుదాం
- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



దాబాగార్డెన్స్: వేసవి తాపానికి విలవిలలాడుతున్న పక్షులు, మూగజీవాల దాహార్తి తీర్చేందుకు అందరూ సహకరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రకటనలో కోరారు. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పక్షులు, మూగజీవాలను కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేసవిలో ప్రతి ఇంటిపైన, పరిసరాల్లో కుండీల్లో నీటిని ఏర్పాటు చేసి పక్షులు, మూగజీవుల దాహాన్ని తీర్చేందుకు ప్రజలు సహకరించాలన్నారు. నగర పరిధిలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసే ప్రక్రియకు జీవీఎంసీ శ్రీకారం చుట్టిందన్నారు. వేసవిలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

82 మందికి 'పర్మినెంట్' ఉత్తర్వులు అందజేత

కొనసాగుతున్న ప్రక్రియ



ఉత్తర్వులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు పర్మినెంట్ ఉత్తర్వుల జారీ ప్రక్రియ ఆదివారం కూడా కొనసాగింది. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఐదు బృందాలు రెగ్యులర్ అవుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించాయి. అనంతరం డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు వారికి పర్మినెంట్ ఉత్తర్వులు అందజేశారు. రెండు రోజుల్లో 82 మందిని పర్మినెంట్ చేస్తూ నియామక ఉత్తర్వులు అందజేసినట్టు డీఎంహెచ్‌వో వివరించారు. 72 ఎంపీహెచ్‌ఏ(మేల్)లో 57 మందికి, ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్స్‌లో ఐదుగురికి, ఏడుగురు ఫార్మసిస్టులు(గ్రేడ్-2) ఏడుగురికి, 13 మంది ఎంపీహెచ్ఏ(ఫీమేల్)లో 13 మందికి ఉత్తర్వులు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

నేడు డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొనదలిచే వారు 1800 4250 0009 టోల్ ఫ్రీ నెంబరుకు ఉదయం 10 నుంచి 11 గంటల్లోపు ఫోన్ చేసి తమ సమస్యలు తెలపవచ్చు. అలాగే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలు నేరుగా మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు ఫిర్యాదు చేయవచ్చు.

61 మద్యం బాటిళ్ల స్వాధీనం

- గోవా నుంచి కాకినాడ తరలిస్తుండగా పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిల్స్‌తో సీఐ రమణ

సబ్బవరం: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద గోవా నుంచి తీసుకొస్తున్న 61 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను సబ్బవరం పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ పిన్నంటి రమణ సిబ్బందితో కలిసి టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారులో మద్యం పట్టుబడింది. పట్టుబడిన మద్యం బాటిళ్లలో పెద్దవి 20, చిన్నవి 41 ఉన్నాయి. వీటి విలువ రూ.30వేల వరకు ఉంటుంది. వీరంతా గోవా నుంచి విమానంలో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టులో దిగారు. సబ్బవరం జాతీయ రహదారి మీదుగా కాకినాడ వెళ్తున్నారు. మద్యం తరలిస్తున్న డ్రైవర్‌తో పాటు కాకినాడకు చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. కారును సీజ్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉత్సాహంగా మహిళా మారథాన్



జుంబా డ్యాన్స్ చేస్తున్న మహిళలు



మారథాన్‌లో పాల్గొన్న మహిళలు

బీచ్‌రోడ్డు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఆదివారం ఉదయం 'మహిళా మారథాన్' ఉత్సాహంగా సాగింది. 21కె, 10కె, 5కె, 3కె విభాగాల్లో నిర్వహించిన మారథాన్‌లో 40 కేటగిరీల్లో విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ మారథాన్‌లో పాల్గొన్న వారిని ఉత్సాహపరిచేందుకు జుంబా డ్యాన్స్‌లు చేశారు. చిన్న పిల్లలు, యువతలు, **వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.**

విశాఖలో ఐకాన్ స్టార్

గోపాలపట్నం: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాకతో విశాఖ విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం సందడి నెలకొంది. షూటింగ్ కోసం విశాఖ వచ్చిన అభిమాన నటుడిని చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఐకాన్ స్టార్.. పుష్ప.. అంటూ నినాదాలు చేశారు. హైదరాబాద్ నుంచి విమానంలో వచ్చిన ఆయన రోడ్డు మార్గంలో నగరంలోని ఓ హోటల్‌కి వెళ్లారు.

సేవలు విస్తృతం స్పెషాలిటీ వైద్యం



- పేద రోగులకు అండగా విమ్స్
- అత్యాధునిక సదుపాయాలతో వైద్య సేవలు
- కొత్త విభాగాల ఏర్పాటుతో పెరిగిన ఓపీ
- వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు



న్యూరో విభాగంలో...



గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డులో అమర్చిన ఆధునిక పరికరాలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) నిర్మాణ రూపకర్త వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా.. రోగులకు అత్యాధునిక పద్ధతిలో వైద్య సేవలందుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో తూతూ మంత్రంగా వైద్య సేవలు అందగా.. పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలనే ఆలోచనతో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమ్స్‌పై దృష్టిసారించారు. సుమారు 500 మందికి పైగా వైద్య నిపుణులతో పాటు అవసరమైన నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బందిని నియమించారు. పలు అభివృద్ధి పనులు, కొత్త పరికరాలు, కొత్త విభాగాలు ఏర్పాటు చేశారు. దీంతో ఐదేళ్లలో విమ్స్‌లో ఓపీ సంఖ్యతో పాటు ఇన్‌పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

విశాలమైన ప్రాంగణంలో..

హనుమంతవాక సమీపంలో ఏర్పాటు చేసిన విమ్స్ ప్రారంభమై నేటికి సుమారు ఎనిమిదేళ్లు దాటింది. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనలకు కార్యరూపమే విమ్స్. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఆస్పత్రిపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి తర్వాత విమ్స్ రూపురేఖలు మారిపోయాయి. రెండేళ్లపాటు కోవిడ్ సేవలందించగా.. అనంతరం కొత్త విభాగాలతో విస్తృత సేవలందిస్తోంది. ఆరోగ్యశ్రీలో ఇప్పటివరకు వేల సంఖ్యలో ఆపరేషన్లు చేశారు. తక్కువ ధరకు రక్త పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రేలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ వైద్యులు అన్ని రకాల వ్యాధులకు అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ సేవలందిస్తున్నారు.

ఇదీ నేపథ్యం

ఉత్తరాంధ్రవాసులకు ఆధునిక సదుపాయాలతో వైద్య సేవలందించాలని 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విమ్స్ ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ఇందుకోసం హనుమంతవాక వద్ద పశుసంవర్ధక శాఖకు చెందిన 99.98 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రూ.250 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆరు బ్లాకుల్లో 1,130 పడకలు, 21 సూపర్ స్పెషాలిటీలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో మొదటి విడతగా భవన నిర్మాణానికి రూ.55 కోట్లు కేటాయించారు. 2007 ఆగస్టులో వైఎస్ రాజశేఖరరెడ్డి విమ్స్‌కు శంకుస్థాపన చేశారు. 2009 డిసెంబర్ నాటికి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనుకున్నారు. 2009లో వైఎస్సార్ అకాల మరణం పొందడం, తర్వాత వచ్చిన పాలకులు పూర్తిస్థాయి నిధులు విడుదల చేయకపోవడంతో పనులు మందకొడిగా సాగాయి. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. తర్వాత రోడ్లు, ప్రహరీ, మార్చురీ, క్యాంటీన్, కిచెన్, రోగుల విశ్రాంతి హాల్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తదితర వాటిని నిర్మించారు. 2016 ఏప్రిల్ 11న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విమ్స్‌ను ప్రారంభించారు. ప్రారంభంలో అరకొర వైద్యులు, ఓపీ సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

పెరిగిన ఇన్‌పేషెంట్ల సంఖ్య

విమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు, నిపుణులైన వైద్యులు ఉండటంతో రోగుల సంఖ్య పెరుగుతోంది. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, తదితర వాటి ద్వారా శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి.

ఆస్పత్రిలో చికిత్స పొందారిలా..

2016	122
2017	1896
2018	3,584
2019	3,870
2,020	890+కోవిడ్ రోగులు 2,711
2,021	1,652+కోవిడ్ రోగులు 2,312
2,022	5,540
2023	6,512





మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డులో పడకలు

విస్తృతమైన సేవలు

విమ్స్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు లక్షల మందికి సేవలు అందించారు. ప్రారంభంలో రోజుకు 100లోపు ఉన్న ఓపీ సంఖ్య ప్రస్తుతం 700 దాటింది. 2016 ఏప్రిల్ నుంచి నుంచి 2019 ఏప్రిల్ వరకు సుమారు 2.50 లక్షలు ఉన్న ఓపీ.. 2019 నుంచి ఇప్పటివరకు సుమారు 7.50 లక్షలు దాటడం విశేషం. కోవిడ్ కారణంగా ఇక్కడ సాధారణ సేవలు, శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో 2020, 2021లో తక్కువ ఓపీ నమోదైంది. 2022 జనవరి నుంచి మళ్లీ ఇక్కడ ఓపీ, ఇన్‌పేషెంట్లు సంఖ్య రానురాను పెరిగింది.

అందుబాటులో 15 విభాగాలు

ఆస్పత్రిలో రోగుల కోసం 15 వైద్య విభాగాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని విభాగాల్లో వైద్యులు, సిబ్బంది ఉన్నారు. జనరల్ సర్జరీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థో, ఈఎన్‌టీ, గైనిక్, పల్మనాలజీ, పీడియాట్రిక్, డెర్మటాలజీ, కార్డియాలజీ, డెంటల్, అంకాలజీ, గ్యాస్ట్రో, ఫిజియోథెరపీ విభాగాల ద్వారా సేవలందిస్తున్నారు.

8కి పెరిగిన ఆపరేషన్ థియేటర్లు

2019 వరకు ఇక్కడ అరకొర సేవలు అందడంతో రోగులు ఆసక్తి చూపేవారు కాదు. దీంతో ఇక్కడున్న నాలుగు ఆపరేషన్ థియేటర్లూ ఖాళీగా ఉండేవి. ప్రస్తుతం అందుబాటులో వైద్య సేవలు, సదుపాయాల కారణంగా రోగులు సంఖ్య పెరిగింది. దీంతో శస్త్రచికిత్సలు పెరగడంతో ప్రస్తుతం 8 ఆపరేషన్ థియేటర్లను వినియోగిస్తున్నారు.



విమ్స్‌లో అందుబాటులో ఆధునిక పరికరాలు

కోవిడ్‌లో విశేష సేవలు

కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో విమ్స్‌లో సాధారణ సేవలకు బ్రేక్ పడింది. కరోనా బాధితులకు వైద్య సేవలు అందించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర కోవిడ్ కేంద్రంగా విమ్స్‌ను ప్రకటించింది. తూర్పు గోదావరి జిల్లా, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కోవిడ్ బారిన పడిన వారికి ఇక్కడ ఉచిత సేవలు అందించారు. మొదటి దశలో (2020)లో 2,711 మందికి, రెండో దశలో(2021)లో 2,312 మంది ఇక్కడ వైద్యం పొందారు.

విధుల్లో 608 మంది సిబ్బంది

విమ్స్‌లో 608 మంది వరకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ తదితర సిబ్బంది ఉన్నారు. వారిలో సుమారు 500 మందిని మూడేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరిలో 57 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 213 మంది కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, 25 మంది జూనియర్ అసిస్టెంట్లు, 28 మంది డీఈవోలు, 19 మంది ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్లు, ఎంఎన్‌వోలు 86 మంది, ఎఫ్ఎన్‌వోలు 86 మంది, 25 మంది స్ట్రెక్చర్ బేరియర్స్, 31 మంది ఆఫీస్ సబార్డినేట్స్, 28 మంది ఎనస్తీషియన్ టెక్నీషియన్లతో పాటు మరో 44 మంది ఇతర సిబ్బంది ఉన్నారు.

త్వరలో మరిన్ని విభాగాలు



విమ్స్‌లో పూర్తిస్థాయిలో వైద్య సేవలందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఇక్కడ సేవలు అందుతున్నాయని రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే కొత్త విభాగాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చాం. మరో రెండు విభాగాలను త్వరలోనే ఏర్పాటు చేస్తాం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉంది.

– డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

కొత్త విభాగాలు

రాష్ట్ర ప్రభుత్వం విమ్స్‌లో మరిన్ని విభాగాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

పీఆర్‌పీ థెరపీ

గత ఏడాది ప్లాస్మారిచ్ ప్లేట్లెట్ థెరపీ(పీఆర్‌పీ) విభాగం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ విభాగం ఏర్పాటు చేయడం విమ్స్‌లోనే మొదటిసారి కావడం విశేషం. ఇక్కడ అందిస్తున్న తర్ఫీదు ద్వారా కీళ్లనొప్పులు నుంచి రోగులకు విముక్తి కలిగిస్తున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఇంతవరకు 200 మందికి పీఆర్‌పీ థెరపీలో ఉచితంగా సేవలందించారు.

కాక్లియర్ ఇంప్లాంటేషన్

ఏడాదిన్నర కిందట రెండు చెవులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ విధానాన్ని కూడా విమ్స్‌లోనే మొదటిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ విధానం ద్వారా ఇద్దరు చిన్నారులకు రెండు చెవులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ చేశారు.

స్పైనల్ న్యూరో రిహాబిలిటేషన్ సెంటర్

రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ ఆస్పత్రుల్లో లేని స్పైనల్ న్యూరో రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఆరు నెలల కిందట ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం లేని ఆధునిక పరికరాలు ఇక్కడ వినియోగిస్తున్నారు. ఇంతవరకు సుమారు 3,500 మందికి ఈ సేవలు అందించారు.

బర్న్స్ వార్డు



బర్న్స్ వార్డులో దోమ తెరలో కూడిన పడకలు

రెండు రోజుల కిందట బర్న్స్ వార్డు అందుబాటులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదాలకు గురైన బాధితులకు అత్యాధునిక సేవలు అందిస్తారు.

ట్రెడ్‌మిల్ టెస్ట్



విమ్స్‌లో ట్రెడ్‌మిల్ టెస్ట్ ఏర్పాటు చేశారు. ఇది కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొదటిది కావడం విశేషం. ఈ పరీక్ష ద్వారా గుండె సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు వీలుపడుతోంది. 2022లో ఇక్కడ అందుబాటులోకి వచ్చిన ఈ విధానం ద్వారా ఇంతవరకు 789 మందికి పరీక్షలు చేశారు.

ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నేతలు

ఎమ్మెల్యే వరుదు కల్యాణి

కొమ్మాది: కుల, మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన సావిత్రిబాయి పూలే చిరస్మరణీయులని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కోలా గురువులు అధ్యక్షతన ఆమె వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్సీ పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు, సమాజ అభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే ఎంతో కృషి చేశారన్నారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీకి విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848లో బాలికల పాఠశాల ప్రారంభించారని గుర్తు చేశారు. తద్వారా భారతదేశం మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తికెక్కారన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణకుమారి, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ, వంకాయల మారుతీప్రసాద్, పోతిన శ్రీనివాస్, బొడ్డు అప్పలనాయుడు, కె.వి.బాబా, వానపల్లి ఈశ్వరరావు, కనకల ఈశ్వరరావు, అప్పన్న, అప్పలనాయుడు, శ్రీలక్ష్మి, శ్రీదేవి, మల్లేశ్వరి, సుశీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

భర్త అడుగుజాడల్లో..

- కళ్లు, పార్థివదేహం దానం



భర్తతో రమాదేవి(ఫైల్)

సీతమ్మధార: సీతమ్మధారకు చెందిన కె.వి.రమాదేవి(82) భర్త అడుగుజాడల్లో నడిచారు. మరణంలోనూ మహోపకారిగా నిలిచారు. ఆదివారం తెల్లవారుజామున ఆమె మృతి చెందగా.. రమాదేవి కళ్లను ఎల్.వి.ప్రసాద్ ఆస్పత్రికి, పార్థివ దేహాన్ని సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు కుటుంబసభ్యులు అప్పగించారు. ఆమె భర్త కె.ఆర్.ఎస్.ఎస్.శాస్త్రి 15 ఏళ్ల కిందట సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్‌కు మరణాంతరం తన పార్థివదేహాన్ని దానం చేస్తున్నట్లు అంగీకారం పత్రం రాసి ఇచ్చారు. జైలర్‌గా పనిచేసిన శాస్త్రి ఐదేళ్ల కిందట మరణించగా.. ఆయన కోరిక మేరకు కళ్లను ఎల్.వి.ప్రసాద్ ఐ ఆస్పత్రికి, పార్థివదేహాన్ని ఏఎంసీకి అందజేశారు. అప్పుడే ఆయన సతీమణి కె.వి.రమాదేవి భర్తను ఆదర్శంగా తీసుకుని, అవయవ దానానికి ముందుకొచ్చారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను వారి బిడ్డలు నెరవేర్చి స్ఫూర్తిగా నిలిచారు. రమాదేవి కుమారుడు కె.శ్రీరామమూర్తి, కోడలు లలిత, కుమార్తె ఉమా కామేశ్వరి, అల్లుడు సుబ్రహ్మణ్యంను ఎస్‌పీఈసీటీ చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి గూడూరు అభినందించారు.

నిబంధనలకు లోబడే బదిలీలు, కొనుగోళ్లు

ఏపీటీడీసీ డీవీఎం హరిత స్పష్టీకరణ

సాక్షి, విశాఖపట్నం : ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ)లో ఇటీవల జరిగిన బదిలీలు పూర్తిగా నిబంధనలకు లోబడి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నిర్వహించినట్లు సంస్థ డివిజనల్ మేనేజర్ హరిత.కె స్పష్టం చేశారు. 'టూరిజం.. ఆమెదే ఏకఛత్రాధిపత్యం' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురించిన కథనంపై ఆమె స్పందించారు. ఏపీటీడీసీ పరిధిలో ఉన్న హోటల్స్, రిసార్టులు, రెస్టారెంట్స్‌లో బదిలీలు పక్కగా నిబంధనల ప్రకారం జరిగాయన్నారు. విశాఖలోని హరిత హోటల్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నందున ఇక్కడ సిబ్బంది ఖాళీగా ఉండకుండా.. వివిధ ప్రాంతాలకు బదిలీ చేపట్టామని తెలిపారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అవసరమైన నిత్యావసరాలను కూడా ఎలాంటి అవకతవకలు జరగకుండా.. పూర్తి పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మల్టీ నేషనల్ సంస్థ మెట్రో స్టోర్ నుంచి నిత్యావసరాలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ.. ఆయా హోటల్స్, రెస్టారెంట్స్, రిసార్టులకు పంపిణీ చేస్తామన్నారు. సబ్బులు, కాఫీ పొడి తదితర సామగ్రిని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా, వంట నూనెలు ప్రభుత్వ ఆధీనంలో నడిచే విజయ ఆయిల్స్ ద్వారా సేకరిస్తున్నామని వెల్లడించారు. కొటేషన్లను ఆహ్వానించి.. తక్కువ ధరకు తమకు సరఫరా చేసే సంస్థల నుంచి కూరగాయలు, చికెన్, చేపల్ని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పేపర్ రేటు కంటే రూ.30కి తక్కువగా ఇచ్చే దుకాణాల నుంచి మాత్రమే తీసుకుంటామని డీవీఎం హరిత వివరించారు. విశాఖ డెయిరీ నుంచి మాత్రమే పాలు, పాల ఉత్పత్తులను కొనుగోలు చేస్తామనీ.. ఎక్కడా అవకతవకలు జరగకుండా ప్రతి వస్తువూ సేకరిస్తున్నామని డీవీఎం తెలిపారు. రుషికొండలో సర్ఫింగ్ కార్యకలాపాల నిర్వహణ డీవీఎం పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. రుషికొండ బీచ్ ఏపీటీఏ రీజనల్ డైరెక్టర్ పరిధిలో ఉంటుందని డీవీఎం హరిత తెలిపారు.

జిల్లా టూరిజం అధికారిగా జ్ఞానవేణి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సత్యపద్మ

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా టూరిజం అధికారి (డీటీసీ)గా జ్ఞానవేణిని నియమించింది. ప్రస్తుతం ఈమె సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి విత్ డ్రా చేస్తూ డీటీసీగా నియమిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు. అదేవిధంగా కాకినాడ ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వహిస్తున్న ఎం.సత్యపద్మని విశాఖ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

క్యాబ్ డ్రైవర్‌ది హత్యా? ఆత్మహత్యా?

- కలకలం రేపిన కాలిన మృతదేహం
- ఎండాడలో ఘటన
- మృతుడిది జగ్గన్నపేట


సంఘటనా స్థలంలో కారు


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం, ఏసీపీ రాంబాబు

కొమ్మాది: ఎండాడలో సగం కాలిన ఓ క్యాబ్ డ్రైవర్ మృతదేహం కలకలం రేపింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఎండాడలోని సెయింట్ లుక్స్ కళాశాలకు సమీపంలో సగం కాలిన మృతదేహాన్ని ఆదివారం వాకర్లు గుర్తించి.. ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఆ మృతదేహం ఎంవీపీకాలనీలో నివాసం ఉంటున్న మోసగంటి సుబ్రహ్మణ్యం(42)దిగా గుర్తించారు. ఆయన క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. సుబ్రహ్మణ్యంకు 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరి సొంతూరు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం జగ్గన్నపేట. కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య తగాదాల కారణంగా మూడేళ్ల కిందట విడాకులు తీసుకున్నారు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. అప్పటి నుంచి సుబ్రహ్మణ్యం ఒంటరిగానే ఎంవీపీలో నివాసం ఉంటూ.. క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా.. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జీవితంపై విరక్తి చెందుతున్నట్లు, బాధతో కొన్ని కొటేషన్లను తన వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టుకున్నాడు. తెల్లవారేసరికి విగతజీవిగా మారాడని అతని సోదరుడు ప్రకాష్ విలపించారు.

అనుమానాలెన్నో..

గతంలో సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో చేతులు కోసుకున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఒంటరిగా బతకలేక పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా హత్య చేసి కాల్చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సుబ్రహ్మణ్యం చనిపోయిన స్థలంలో రెండు మద్యం బాటిల్స్, అతని కాలిపై గాయాలున్నాయి. సంఘటన స్థలంలోనే కారు ఉంది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ రాంబాబు, ఆరిలోవ సీఐ గోవిందరావు సుబ్రహ్మణ్యం మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని.. ఇప్పటికే క్లూస్ టీమ్ వివరాలు సేకరించిందన్నారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు వివరించారు.


మోసగంటి సుబ్రహ్మణ్యం(ఫైల్)

ఆర్టీసీ సమ్మర్ ఆఫర్!

- దూర ప్రాంతాలకు రాను పోను టికెట్లపై రాయితీ
- ముందస్తు రిజర్వేషన్‌తో చార్జీలో 10 శాతం తగ్గింపు
- గతంలో ఒకవైపు ప్రయాణానికే ఈ సబ్సిడీ
- వేసవి ముగిసే దాకా ఈ సదుపాయం వర్తింపు



సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీ ఈ వేసవిలో ప్రయాణికులకు ఊరటనిచ్చే ఆఫర్ ఇస్తోంది. దూర ప్రాంతాలకు వెళ్లే వారికి రాను పోను ప్రయాణ టికెట్లపై రాయితీని ప్రకటించింది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి, అటు నుంచి తిరిగి రావడానికి ముందస్తు రిజర్వేషన్ చేయించుకునే వారికి ఈ వెసులుబాటు కల్పించింది. గతంలో రాను పోను ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తే తిరుగు ప్రయాణం టికెట్ చార్జీలో 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడు అలా కాకుండా రెండు వైపులా చార్జీలో 10 శాతం తగ్గింపు ఉంటుంది. ఉదాహరణకు విశాఖపట్నం నుంచి రాజమండ్రికి సూపర్ లగ్జరీ టికెట్ ధర రూ.400 ఉందనుకుంటే ఇటు నుంచి టికెట్‌లో 10 శాతం, అటు నుంచి టికెట్ చార్జీలో మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. ఈ లెక్కన రెండు వైపులా ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే రూ.80 (రూ.40+40) రాయితీ పొందుతారు. సాధారణంగా వేసవి సీజనులో ప్రయాణాలు అధికంగా ఉంటాయి. విద్యార్థులకు సమ్మర్ సెలవులతో పాటు పెళ్లిళ్ల సీజను కూడా కావడంతో దూరప్రాంతాలకు ప్రయాణించే వారు పెద్ద సంఖ్యలో ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను సమకూరుస్తుంటారు. ఈసారి వేసవిలో రాను పోను రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికుల కోసం ఆర్టీసీ రాయితీ వెసులుబాటును కల్పించింది. ఇది ప్రయాణికులకు ఒకింత ఉపశమనం కలిగించనుంది. వేసవి ముగిసే దాకా ఈ సదుపాయం కొనసాగనుంది. రైలులో ప్రయాణించేవారు తమ గమ్యస్థానాలకు వెళ్లి రావడానికి ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. ఇప్పుడు ఆర్టీసీలోనూ అదే తరహా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. అయితే రైల్వేలో రాను పోను రిజర్వేషన్ చేయించుకున్నా టికెట్ చార్జీలో ఎలాంటి తగ్గింపు ఉండదు. కానీ ఆర్టీసీలో 10 శాతం రాయితీ ఇస్తుండడం విశేషం! ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు కోరారు.

కాపు అభ్యర్థులను గెలిపించుకుందాం


ఐక్యత చాటుతున్న కాపు సంఘం నేతలు

- కాపు సామాజిక వర్గ నాయకుల సమావేశంలో తీర్మానం
- పాల్గొన్న వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ


కాపు సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ

గోపాలపట్నం: పార్టీలకు అతీతంగా కాపు అభ్యర్థులను గెలిపించుకునేందుకు అందరూ ఐకమత్యంగా కృషి చేయాలని కాపు సామాజిక వర్గ సంఘాలు తీర్మానించాయి. బాజీ జంక్షన్‌లోని ఫంక్షన్ హాలులో ఆదివారం ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ పాల్గొని మాట్లాడారు. కాపులంతా ఏకమై ఈ సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు కాపు సామాజిక వర్గ గొంతును పార్లమెంటులో వినిపించానని గుర్తు చేశారు. విశాఖ పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ గతంలో కార్పొరేటర్‌గా పీలా ఉమారాణి గెలుపునకు కాపులంతా ఐకమత్యంతో కృషి చేశారని, తన గెలుపునకు కాపులు, బలహీన వర్గాలు అండగా నిలిచారన్నారు. కాపు అభ్యర్థి లేని చోట కాపుల కోసం కృషి చేసిన వారికి మద్దతుగా నిలబడదామన్నారు. పలు కాపు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కాపు, బలిజ, తెలగ సామాజిక అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాపు సంఘ నేత డాక్టర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీతివంతమైన పాలనకు అండగా నిలుద్దాం


సమావేశంలో పాల్గొన్న బూత్ లెవల్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, సమన్వయకర్త ఆనంద్‌కుమార్

- ప్రతీ ఇంటికి వెళ్లి చేసిన మంచిని చెబుదాం
- రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ

గోపాలపట్నం: రాష్ట్రంలో నీతివంతమైన పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దామని వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ అన్నారు. విశాఖ డెయిరీ ట్రస్ట్ ఆడిటోరియంలో ఆదివారం 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' బూత్ లెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని శ్రీహరిపురం తన పుట్టినిల్లు అని.. ఇక్కడే పెరిగానని గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ప్రతీ ఇంటికి వెళ్లే పరిస్థితిని ముఖ్యమంత్రి కల్పించారన్నారు. ఇచ్చిన హామీలు 99 శాతం పూర్తి చేశారని, హామీలు ఇవ్వనివాటిని కూడా అందించారన్నారు. ప్రభుత్వ పథకాలు అందించే క్రమంలో అవినీతికి తావు లేకుండా.. నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేశారన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజులు ఎంతో కీలకమని, సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులందరినీ కలవాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను, మేనిఫెస్టోను మాయం చేసిన వైనాన్ని తెలియజేయాలన్నారు.

మంచి జరగాలంటే...

ప్రజలకు ఈ ఐదేళ్ల పాటు జరిగిన మంచి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని అమర్‌నాథ్ అన్నారు. పశ్చిమంలో వైఎస్సార్ సీపీ గెలుపు ఎంత అవసరమో ప్రజలకు తెలపాలన్నారు. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే ప్రజలకు దూరంగా ఉన్నారని, కరోనా సమయంలో ప్రజల బాగోగులు కూడా చూడలేదని విమర్శించారు. అలాంటి నాయకుడిని మళ్లీ ఎన్నుకునే పరిస్థితి రాకూడదన్నారు. అందరికీ అందుబాటులో ఉన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిని, తాను సమన్వయకర్తగా వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని ప్రతీ ఇంటికి వెళ్లి వివరిద్దామన్నారు. అనంతరం బూత్ లెవల్ కమిటీ సభ్యులకు కిట్లు అందించారు. పశ్చిమ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, సచివాలయం కన్వీనర్లు, ఆర్పీలు, బూత్ లెవల్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబూ.. దమ్ముంటే భీమిలి నుంచి పోటీ చెయ్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి సవాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కొమ్మాది: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు దమ్ముంటే.. భీమిలి నుంచి తనపై పోటీ చేసి గెలవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బీసీ కాలనీలో బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు తాను గెలవలేక, పార్టీని నడిపించుకోలేక జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రజలకు ఏమి చేయలేదని.. ఇప్పుడు ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఏ ప్రభుత్వాలు భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 2019 నుంచి ఇప్పటి వరకు రూ.504 కోట్ల 87 లక్షల 44 వేల నిధులతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. అందుకే భీమిలి నుంచి చంద్రబాబు లేదా పవన్ కల్యాణ్ పోటీ చేసినా గెలిచేది వైఎస్సార్ సీపీ అని అన్నారు. సిద్ధం సభలతో యుద్ధం ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి చంద్రబాబు భయపడ్డారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతీ బూత్ కన్వీనర్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. భీమిలి నియోజకవర్గంలో పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, లొడగల రామ్మోహన్, ముదుండి రాజేశ్వరి, వంకాయల మారుతీప్రసాద్, నొడగల రాంబాబు, దువ్వి వాసు, చెన్నా దాసు తదితర నాయకులు పాల్గొన్నారు.

జోరుగా హుషారుగా..

- జూలో సైకిళ్లపై యువత సందడి


జూలో సైకిళ్లు తొక్కుతున్న యువకులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో బ్యాటరీ సైకిళ్లపై యువత సందడి చేస్తోంది. జూలో కొన్నాళ్లుగా సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని తొక్కుతూ జూ లోపల అంతా తిరిగేవారు. గత నెల 22న బ్యాటరీతో నడిచే సైకిళ్లను జూ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రారంభంలో 10 సైకిళ్లు అందుబాటులో తీసుకురాగా.. వీటిపై యువతకు ఆసక్తి పెరిగింది. దీంతో మరో 10 బ్యాటరీ సైకిళ్లను సిద్ధం చేశారు. వీటిని జూ ప్రధాన ద్వారంతో పాటు సాగర్‌గేటు వద్ద సందర్శకుల కోసం అందుబాటులో ఉంచారు. ఒక్కో సైకిల్‌కు గంటకు రూ.70 చొప్పున చెల్లించి.. జూ లోపల తిరగవచ్చు. బ్యాటరీని ఉపయోగించి మోపెడ్ మాదిరిగా వెళ్లొచ్చు.. లేదంటే కాళ్లతో తొక్కుతూ వెళ్లవచ్చు. దీంతో వీటి వినియోగంపై ఆసక్తి పెరిగింది. జూ రోడ్లపై యువత హుషారుగా తిరుగుతూ.. ఎన్‌క్లోజర్లలో వన్యప్రాణులను తిలకిస్తున్నారు.

తీరానికి కొట్టుకుని వచ్చిన తాబేలు కళేబరం


సాగర్‌నగర్ తీరంలో భారీ తాబేలు కళేబరం

కొమ్మాది : సాగర్‌నగర్ బీచ్‌కు ఆదివారం సాయంత్రం భారీ తాబేలు కళేబరం కొట్టుకుని వచ్చింది. సెలవు రోజు కావడంతో పర్యాటకులు ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్నారు. ఒక్కసారిగా భారీ తాబేలు కళేబరం కొట్టుకుని రావడంతో పర్యాటకులు ఆవేదనకు గురయ్యారు. ఇటీవల కాలంలో డాల్ఫిన్‌లు, తాబేళ్లు వరుసగా ఇలా మృత్యువాత పడుతున్న సంగతి తెలిసిందే. సముద్రంలో కాలుష్యం పెరిగిపోవడం.. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం వల్ల ఇలా మృత్యువాత పడుతుంటాయని ఇక్కడ మత్స్యకారులు చెబుతున్నారు.

కీర్తికి పూర్వ విద్యార్థుల సాయం


కీర్తికి రూ.5,500 అందిస్తున్న చిట్టివలస హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: బంగ్లామెట్టకు చెందిన జూడో క్రీడాకారిణి పాలెపు కీర్తికి చిట్టివలస జిల్లా పరిషత్ హైస్కూల్ 1995–96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రూ.5,500 అందించారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి జూడో పోటీల్లో ఆమె తలపడనుంది. 'జూడో కీర్తి పతాక' శీర్షికతో శనివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వీరు స్పందించారు. ఎర్నింటి కృష్ణ, బాసాన శ్రీను, కె.దుర్గారావు, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు న్యూఢిల్లీ వెళ్తున్న ఆమెకు వీడ్కోలు పలికారు.


అభివృద్ధి పథంలో జిల్లా కోర్టు

- జూనియర్ న్యాయవాదులకు ప్రతీ శుక్రవారం తరగతులు
- విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు


వివరాలు వెల్లడిస్తున్న విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు


అల్లిపురం: గత ఏడాది కాలంలో జిల్లా కోర్టులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు అన్నారు. రూ.35 కోట్లతో నిర్మించిన నూతన కోర్టు భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, బార్ అసోసియేషన్ కమిటీ సభ్యుల సహకారంతో ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరేంద్ర సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కోర్టుకు వచ్చే న్యాయవాదులకు, కక్షిదారులకు మెరుగైన సౌకర్యాలు అందజేయడమే ధ్యేయంగా కమిటీ పనిచేసిందన్నారు. చీఫ్ జస్టిస్ సహకారంతో జిల్లా కోర్టులో 230 ఏసీలు, ఫర్నీచర్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని బార్ అసోసియేషన్ల క్రికెట్ ప్రతినిధులతో టోర్నమెంట్ నిర్వహించామన్నారు. ఈ ఏడాదిలో పది నెలల పాటు జూనియర్, సీనియర్ న్యాయవాదులకు లా కాలేజీ ప్రొఫెసర్లతో న్యాయసలహాలు, క్లాసులు ప్రతి శుక్రవారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ట్రెజరర్ చింతా భాస్కర్‌రావు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆడారి అప్పారావు ఇతర కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు సహకారంతో అసోసియేషన్ అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. త్వరలోనే క్రిమినల్ కోర్టు భవనంలో రెండు కొత్త లిఫ్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ ధర్మాల దుర్గాప్రసాద్, లేడీ రిప్రజెంటేటివ్ కే లక్ష్మీ దుర్గా నాగశ్రీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చవిటిపల్లి బాలరాణి, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఈగల పద్మలత, కరకాని వరప్రసాద్, పి.శ్రీధర్, మణికంఠ పాల్గొన్నారు.

పోర్టు స్టేడియం.. పోర్టు ట్రస్టే కొనసాగించాలి


స్టేడియం వద్ద ధర్నా చేస్తున్న వార్వా నివాస్ ప్రతినిధులు

సీతంపేట: పోర్టు స్టేడియంను పోర్టు ట్రస్టు ఆధ్వర్యంలోనే నడపాలని, ప్రైవేటీకరణ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వార్వా నివాస్ ఆదివారం ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా వార్వా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రకాష్‌రావు, బి.బి.గణేష్ మాట్లాడుతూ ఈ స్టేడియం పోర్టు ట్రస్టుకి చెందినది అంటే ప్రజల ఆస్తి అని, కానీ ఇప్పుడది విశ్వనాథ్ ఆస్తిగా మారిపోయిందన్నారు. విశ్వనాథ్ పోర్టు స్టేడియం, విశ్వనాథ్ కన్వెన్షన్స్‌గా స్టేడియంలో ప్రతీది విశ్వనాథ్ వెంచర్ అయిపోయిందన్నారు. ఇప్పటి వరకు ఉచితంగా, తక్కువ ఫీజులతో ఆటలు ఆడుకునే సదుపాయం ఉండేదని, ప్రస్తుతం భారీగా ఫీజులు పెరిగిపోయాయన్నారు. ఉదాహరణకు స్టేడియంలో ఆదివారం ఫుల్ డే క్రికెట్ ఆడాలంటే రూ.36 వేలు చెల్లించాలన్నారు. నామమాత్రపు ఫీజులతో ప్రజలు వాకింగ్ చేస్తున్నారని, ఇప్పుడు భారీగా ఫీజు చెల్లించే పరిస్థితి వచ్చిందన్నారు. స్టేడియంలో చెట్లను నరికి కాంక్రీట్ బిల్డింగులు కట్టి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. పోర్టు స్టేడియం ప్రైవేటీకరణ అన్ని విధాల నష్టదాయకమని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించి పోర్టు ట్రస్టు ఆధీనంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. నివాస్ అధ్యక్ష,కార్యదర్శులు పి.లచ్చిరాజు, పిట్టా నారాయణమూర్తి, అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శులు జగిప్రసాద్, మురళీరాజు, బి.ఎల్.నారాయణ, బి.సత్యనారాయణ, వాకర్స్ పాల్గొన్నారు.

గాజువాక నుంచే పవన్ కల్యాణ్ పోటీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోన తాతారావు

గాజువాక : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ గాజువాక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు కోరారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ గాజువాక నుంచే పోటీ చేయాలన్నది తమ నాయకులందరి ఏకాభిప్రాయమన్నారు. గాజువాకలో అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించడం కోసం ఇటు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అటు కేంద్ర ప్రభుత్వంతో కూడా మాట్లాడాల్సి ఉంటుందన్నారు. ఆ అవకాశం పవన్ కల్యాణ్‌కు మాత్రమే ఉందన్నారు. ఇక్కడ పోటీపై పవన్ సర్వే చేయించుకున్నారని, ఆయన అభ్యర్థిత్వంపై ప్రజలు సుముఖంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, గంధం వెంకటరావు, కరణం కనకారావు, గవర సోమశేఖర్ పాల్గొన్నారు.